క్లుప్తంగా

పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ఆర్.జంబులదిన్నెలో సీతారాములకు భజన చేస్తున్న భక్త బృందం

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో మంగళవారం వర్షం కోసం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం పెద్దయమ్మనూరు రహదారిలో వనం వద్ద సహపంక్తి వన భోజనంతో పాటు భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాజనగరం విద్యార్థిని ప్రతిభ



విద్యార్థితో టీచర్లు

శిరివెళ్ల: తమ పాఠశాల విద్యార్థిని యశస్విని రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వరాహమయ్య తెలిపారు. మంగళవారం విద్యార్థినిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంది బాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థిని యశస్విని ప్రతిభ కనపరిచి నవంబర్ 9 నుంచి 11 వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిందన్నారు.

భాగ్యనగరం విద్యార్థులు..



విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నంద్యాలలో జరిగిన 7వ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. అక్టోబరు 28, 29, 30 తేదీలలో నిర్వహించిన టోర్నమెంట్‌లో జిల్లాస్థాయిలో విజయం సాధించారు. ఈసందర్భంగా హెచ్ఎం ఆదిలక్ష్మమ్మ మంగళవారం పీడీ శ్రీధర్, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, గంగాధర్, సురేష్‌బాబు, నాగరాజు, లక్ష్మిఈశ్వరమ్మ, మధు, వహిద పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించి 108 వెండి పుష్పాలచే పూజించారు. చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈడ లక్ష్మీనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన 11 మంది పేకాటారాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్ మంగళవారం తెలిపారు. సాయంత్రం శిరివెళ్ల– ఇసుకపల్లె రస్తాలోని చెరువు సమీపంలో పొలాల మధ్య ఉన్న పబ్లిక్ స్థలంలో పేకాటాడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.40 వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనలో మరికొందరు తప్పించుకుని పారిపోయారన్నారు.

యాత్ర జనజాతర కావాలి

- రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి



మాట్లాడుతున్న గంగుల ప్రభాకరరెడ్డి

శిరివెళ్ల: జగనన్న సామాజిక సాధికారిక బస్ యాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జనజాతరను తలపించేలా విజయవంతం చేయాలని రాష్ట్ర జల వనరుల సలహాదారు గంగుల ప్రభాకర రెడ్డి అన్నారు. బస్ యాత్రపై మండల కేంద్రంలోని షాదిఖానా ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్ యాత్ర నవంబర్ 7న జిల్లాలో ఉంటుందన్నారు. రూట్ మ్యాప్ 3వ తేదీ తయారువుతుందని, ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. జగనన్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కుల మతాలకు అతీతంగా రాజ్యాంగ పదవులు ఇచ్చారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే నలుగురికి రాష్ట్ర డైరెక్టర్ పదవులు దక్కాయన్నారు. మహిళలకు కూడా సముచిత స్థానం లభించిందన్నారు. ఇటీవల పార్లమెంట్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 50 శాతం పదవులిచ్చారన్నారు. ఇంత వరకు దేశంలో ఏ పార్టీ, ఏ సీఎం చేయలేదన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు కొన్ని కులాలకే పదవులు ఇచ్చుకున్నారన్నారు. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ అందుబాటులో ఉన్న నీటితో పంటల రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. నీటి కొరతపై రాజకీయాలు తగవని టీడీపీ నాయకులకు హితవు పలికారు. ఈ నాలుగున్నరేళ్లలో రైతులకు పుష్కలంగా సాగునీరు అందించామన్నారు. ప్రభుత్వం చేసిన ప్రతి పనిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, ఆర్యవైశ్య సంఘం మండల నాయకుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సర్పంచులు సాలమ్మ, శివారెడ్డి, జింకల నాగన్న, మరియమ్మ, ఉశేనిబీ, పెద్ది రమణయ్య, రఘునాథరెడ్డి, సభహాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



చిత్రేనిపల్లెలో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిత్రేనిపల్లె దళిత కాలనీలో చర్చి ప్రాంగణానికి సంబంధించి స్థలం, ప్రహరీ నిర్మాణ సమస్య నెలకొంది. కాలనీ వాసులు చర్చి నిర్వాహకులు సమస్యను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో సమస్య పరిష్కారమైంది. వెంటనే కాలనీ వాసులు కలిసి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అనంతరం చర్చి వేడుకలు నిర్వహించారు. ఆ వేడుకల్లో పాల్గొనాలని కాలనీ వాసులు ఆహ్వానించడంతో మంగళవారం ఎమ్మెల్యే గ్రామానికి చేరుకున్నారు. గ్రామ శివారులోకి రాగానే గ్రామస్తులు, కాలనీ వాసులు గజమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. ఆయన వెంట ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జెల రాఘవేంద్రారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రసాదరెడ్డి, మాధవ, నరసింహ్మాయ్య మండల కన్వీనర్ నాగేష్ తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న లక్ష్యం

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 13వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు కదిలారు. సీఎం జగన్ అమలు చేసిన సచివాలయ వ్యవస్థతో పథకాలు ప్రజల చెంతకే చేరుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు చంద్రశేఖర్, సునిత అమృతరాజ్, నంద్యాల మూడవ పట్టణ అధ్యక్షులు పడకండ్ల సుబ్రమణ్యం, జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్ కాల్వ సరస్వతి, వైఎస్సార్‌సీపీ 13వ వార్డు ఇన్‌చార్జ్ కాల్వ నాగరాజు, నాయకులు టైలర్ శివ, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఎస్ఎస్‌ఖాద్రి, గురునాథ్, అడ్వకేట్ మాధవరెడ్డి, శిరిగిరి రమేష్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, రామకృష్ణ, దేవక్క, ఆర్‌వీ సుబ్బారెడ్డి, అల్లాబకాష్, వైఎస్సార్‌సిపి నాయకులు కౌన్సిలర్లు భాస్కర్, కలాంబాషా, సాదిక్ పాల్గొన్నారు.

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా,సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ రవిచంద్రారెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎజెండాలోని 13 అంశాలను సభ్యులు ఆమోదం తెలిపారు. కౌన్సిల్ ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తయినా సబ్‌కమిటీలు ఏర్పాటు చేయలేదని కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా సభ దృష్టికి తెచ్చారు. 10వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ పెద్ద మార్కెట్‌లో జరిగిన ఫైర్ యాక్సిడెంట్ బాధితులకు రూ.23 లక్షల ఆర్థిక సాయం చేసిన సీఎం జగనన్నకు, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డికి వార్డు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. 33వ వార్డులో తాగు నీటి సమస్య ఉందని సభ్యులు మనోరంజని చెప్పారు. సీఎస్‌ఐ చర్చి వద్ద కాల్వను నిర్మించాలని కౌన్సిల్‌ను కోరారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా ఆక్రమణలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు ప్రతి ఇంటికీ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఈలకు సూచించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈలు జయభారత్‌రెడ్డి, మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య

ఉయ్యాలవాడ: పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యలో భాగంగా గుణాత్మక విద్యనందించే ప్రక్రియ నిమిత్తం పరీక్షా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఈఓ -1 అనురాధ, ఎంఈఓ-2 వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, 9 తరగతుల విద్యార్థులకు నవంబర్ 3న జరగబోవు పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు. మండల పరిధిలో 34 పాఠశాలలు వుండగా 23 పాఠశాలల్లో ఎంపిక చేసుకుని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు వారి సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ విధానాలపై పోరాడుతాం

- కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ సూచించారు. సీపీఎం ప్రజా రక్షణ భేరి బస్సు జాతా మంగళవారం మధ్యాహ్నం నంద్యాల పట్టణానికి చేరుకుంది. రాజ్‌థియేటర్ సమీపంలోని జీవీ షాపింగ్‌మాల్ ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందన్నారు. రాయలసీమ ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. రైతులందరికీ గిట్టుబాటు ధరలు కల్పించాలని, పెంచిన ధరలు తగ్గించాలని, కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, లక్ష్మణ్, బాలవెంకట్, సీపీఎం నాయకులు నాగరాజు, తోట మద్దులు, మహమ్మద్ గౌస్, లింగం, దర్శనం తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి



ఎజెండా వినిపిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని పురపాలక సంఘం అధ్యక్షులు డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. స్థానిక పురపాలక సంఘం సమావేశ భవనంలో మంగళవారం కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన పురపాలక సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేయాలన్నారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని సూచించిన సభ్యుల ప్రశ్నకు ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మాదం మరియమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయండి

నంద్యాల: జిల్లాలోని 99 అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల్లో ప్రగతి కనపడాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణ ప్రగతి, జీఈఆర్ సర్వే, రీ ఎన్‌రోల్‌మెంట్‌పై విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ లలిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

టూరిజం ప్యాకేజీలు ఏర్పాటు చేయండి

నంద్యాల: జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, నల్లమల అటవీ ప్రాంతాలను కలుపుతూ టూరిజం ప్యాకేజీల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో పర్యాటక అభివృద్ధి, టూరిజం ప్యాకేజీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీ టూరిజం డెవప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ఈశ్వరయ్య, టూరిజం అధికారి సత్యనారాయణ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



పటేల్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం



చాగలమర్రిలో సర్దార్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వల్లభాయి పటేల్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాగలమర్రిలో..

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిలో ఎలుకలను నివారించుకోండి



శిరివెళ్ల ఆర్‌బీకే వద్ద ఎలుక మందు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శిరివెళ్ల: వరిలో ఎలుకలను నివారించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ రాంమోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. ఎలువల నివారణ మందు తయారీపై మంగళవారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్,ఏఈఓలు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలోని కదిరిపురం తండాలో ఏఓ రంగనేతాజీ ఆధ్వర్యంలో మంగళవారం వరి పొలాల్లో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. విషపు ఎర ద్వారా ఎలుకలను నిర్మూలించుకోవాలని ఏఓ సూచించారు. కేజీ విషపు ఎర తయారీకి 960 గ్రాములు బియ్యపు నూకలు, 20 గ్రాముల నూనె, 20 గ్రాముల బ్రోమోడయాలిన్ రసాయనాన్ని కలిపి ఎలుకలు ఏర్పాటు చేసిన రంధ్రాల్లో వేయాలన్నారు.

దీబగుంట్లలో..

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామ రైతులకు వరి పొలంలో ఎలుకల నిర్మూలన గురించి వ్యవసాయాధికారి స్వప్నికా రెడ్డి అవగాహన కల్పించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ



గుడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ

ఉయ్యాలవాడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. మోడల్ స్కూల్‌లో కోడిగుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు తినలేక బయట పడేసిన ఘటనపై ఇటీవల పత్రికల్లో రావడంతో ఎంపీపీ మంగళవారం ఎంఈఓ -1 అనురాధ, ఎంఈఓ -2 ప్రతాప్‌రెడ్డిలతో కలిసి స్కూల్‌కి వెళ్లి తనిఖీ చేశారు. నాణ్యత లేని గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీలపై డీఈఓ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంఈఓలకు ఎంపీపీ సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. భోజనం తయారీపై నిఘా పర్యవేక్షణ ఉండాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డాక్టర్

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని పేరాయిపల్లెలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, ఇద్దరు ప్రత్యేక వైద్యనిపుణులు 451 మందికి వైద్య సేవలందించారు. 26 మందికి ఈసీజీ తీశారు. 215 మందికి రక్త పరీక్షలు చేశారు. మిగతా వారికి కంటి, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు అందజేశారు. శస్త్రచికిత్సలు, మెరుగైన వైద్యం సేవలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు.

ఆరోగ్యశ్రీ కేసులను నిర్లక్ష్యం చేయొద్దు

నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన రెఫరల్ కేసులను నిర్లక్ష్యం చేయొద్దని సర్వజన ఆసుపత్రి సూపరిన్టెండెంట్ వరప్రసాద్ రావు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో అన్ని విభాగాల డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రజల సుఖసంతోషాలే పోలీసుల ధ్యేయం

బొమ్మలసత్రం: ప్రజల సుఖసంతోషాలే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీనివాససెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు పోలీస్ సిబ్బంది క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, రంగముని పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



వైద్యం కోసం వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం స్థానిక 6వ వార్డు పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యులు పలువురికి బీపీ, షుగర్, రక్త, కంటి పరీక్షలు నిర్వహించారు. మందులు, కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎమ్మెల్యే శిల్పా రవి ప్రజల ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పురందర్‌కుమార్, మున్సిపల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.